230 మంది విద్యార్థులకు..
తరగతి గదులు మూడే

- కూర్చునేందుకు సరిపడా బెంచీలు లేని వైనం
- సమస్యల వలయంలో బోరబండ ప్రభుత్వ జూనియర్ కళాశాల


ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని జూనియర్ కళాశాల

బోరబండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. బోరబండ బలహీనవర్గాల కాలనీలో నాట్కో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జూనియర్ కళాశాలను 2016లో ప్రారంభించారు. సీఈసీ, ఎంఈసీ గ్రూపులకు చెందిన తెలుగు, ఇంగ్లిష్ మీడియం ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 230 మంది చదువుతున్నారు. మూడు గదుల్లో తరగతులు కొనసాగుతున్నాయి. విద్యార్థులు కూర్చునేందుకు సరిపడా బెంచీలు కూడా లేవు. కళాశాలను విస్తరిస్తామన్నా ఇప్పటి వరకు చేయలేదు. ఐదుగురు రెగ్యులర్ అధ్యాపకులు మాత్రమే ఉన్నారు. కళాశాలలో టాయిలెట్ సౌకర్యం కూడా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఆటస్థలం కూడా లేదు.

కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. కళాశాల భవనం కోసం అనువైన స్థలాన్ని కేటాయించాలని ప్రిన్సిపాల్, స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులకు విన్నవించినా ఫలితం లేదంటున్నారు. ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కళాశాలలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని బోరబండ పరిసర ప్రాంతాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. కళాశాలలో సమస్యలను పరిష్కరించాలని మానవ హక్కుల కమిషన్‌లో న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు.

శాశ్వత భవనం నిర్మించాలి



బోరబండ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు శాశ్వత భవనాన్ని నిర్మించాలి. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేకపోవడంతో ఏటా తమ వద్దకు వచ్చిన 3, 4 వందల మంది విద్యార్థులను నాంపల్లి, సికింద్రాబాద్, కూకట్‌పల్లి, లింగంపల్లి కళాశాలలకు పంపిస్తున్నాం. శాశ్వత భవనాన్ని నిర్మిస్తే ఎంపీసీ, బైపీసీ గ్రూపులతోపాటు వృత్తివిద్యా కోర్సులను అందించే అవకాశం ఉంటుంది.

- ఎస్.మహాలక్ష్మి, బోరబండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్


ఇజ్జత్‌నగర్‌లో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

పార్టీ కోసం కష్టపడేవారికి ప్రాధాన్యం

హైటెక్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడేవారికి రానున్న ఎన్నికలలో ప్రాధాన్యం ఉంటుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఇజ్జత్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన బీఆర్ఎస్ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పార్టీ మారింది భూ కబ్జాలు చేసుకోవడానికని విమర్శించారు. మాజీ మంత్రి కేటీఆర్ రూ. 9వేల కోట్లతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన బ్రిడ్జిలకు రంగులు వేస్తూ తామే అభివృద్ధి చేశామని మంత్రులు చెబుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు సాయిబాబా, రంగారావు, నవతరెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నిమ్స్ మేలో దత్తత మాసోత్సవాలు

బోరబండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ దత్తత విభాగం ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడలోని నిమ్స్ మేలో సోమవారం దత్తత మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా దత్తతపై అవగాహన, పిల్లల పునరావాసం, దత్తత ప్రక్రియలో భాగస్వామ్య సంస్థల పాత్రపై చర్చలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు చెందిన అధికారులు, మేనేజర్లు, సిబ్బంది పాల్గొంటారని పేర్కొన్నారు.


ముదిరాజ్ జవహర్‌నగర్ కార్యవర్గ సభ్యులు

ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి కృషి

వెంగళరావునగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సంఘం జవహర్‌నగర్ అధ్యక్షుడు నెల్లి శంకర్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం జవహర్‌నగర్‌లో ముదిరాజ్ సంఘం విస్తృతస్థాయి సమావేశం జరిగింది. వివిధ అంశాలపై చర్చించారు. ముదిరాజ్‌లకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతోందన్నారు. ముదిరాజ్‌లను బీసీ-డి గ్రూపు నుంచి బీసీ-ఏ గ్రూపులోకి మార్చాలని కోరారు. అనంతరం సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

కార్యవర్గం

అధ్యక్షుడిగా నెల్లి శంకర్ ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా గంట నారాయణస్వామి, మాదాసు రాజు, ప్రధాన కార్యదర్శిగా పసుల రామకృష్ణ ముదిరాజ్, కోశాధికారిగా వనపర్తి రవీంద్ర ముదిరాజ్, సంయుక్త కార్యదర్శులుగా పి.చిన్నయ్య, చంద్రమౌళి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా నెల్లి కనకయ్య, నరసింహ, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా వెంకటేశ్, ఎస్. శ్రీను, ఎన్.రవి, డి.వినోద్, ఎస్.శ్రావణ్, డి కృష్ణ. పరమేష్, సందీప్, నెల్లి ప్రదీప్ ముదిరాజ్, సలహాదారులుగా ఎం.రాములు, ఏ.రాజేంద్ర, దండు సత్యనారాయణ ఎన్నికయ్యారు.


బాధితుడి కుటుంబ సభ్యులకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

అమీర్‌పేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న బల్కంపేట బీజేఆర్‌నగర్‌కు చెందిన చెలిమెల శ్రావణ్‌కుమార్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 60 వేలు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బాధితుడి కుటుంబ సభ్యులకు ఆదివారం చెక్కు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కె. నర్సింహ, కట్టా బలరాం, చెలిమెల శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా కమిషనర్ అబద్ధం చెబుతున్నారు

- హనుమాన్ ఆలయ స్థాన చలనానికి అంగీకరించలేదు
- సియెట్ నివాసితుల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సదానందం

హైటెక్‌సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గుట్టల బేగంపేట్‌లోని సున్నం చెరువు వద్ద ఉన్న హనుమాన్ ఆలయం స్థాన చలనానికి తాము అంగీకరించినట్టు హైడ్రా కమిషనర్ చెప్పిన దాంట్లో వాస్తవం లేదని, ఆయన అబద్ధాలు చెబుతున్నారని సియెట్ నివాసితుల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సదానందం అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. హనుమాన్ ఆలయం స్థాన చలనంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ తమతో సంప్రదించలేదన్నారు. సమస్యలపై ఆయనను కలిశామని ఆ ప్రకటనలో తెలిపారు.



ఊరేగింపులో యువత

ఘనంగా గ్యార్మీ వేడుకలు

బోరబండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్యార్మీ వేడుకలు బోరబండలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు మహమ్మద్ బాబర్ ఆధ్వర్యంలో సైట్-3 కాలనీ నుంచి బోరబండ ప్రధాన రహదారి, బస్టాండ్ మీదుగా సైట్-1 కాలనీ కమాన్ వద్దనున్న ఛిల్లా వరకు శనివారం రాత్రి జెండాలు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. మార్గమధ్యంలో ఉన్న పలు ఛిల్లాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం ఉదయం సైట్-3 కాలనీలో బాబర్ నివాసం వద్ద అన్నదానం చేశారు.

చికిత్స పొందుతున్న మరో హిజ్రా మృతి

బోరబండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో హిజ్రా ఆదివారం మరణించింది. హిజ్రాల గ్యాంగ్ లీడర్ తమపై దాడి చేసిందంటూ ఈనెల 17వ తేదీన హిజ్రాలు బోరబండలో ఆందోళన చేపట్టి శరీరంపై పెట్రోల్ పోసుకుని పలువురు నిప్పంటించుకున్న విషయం తెలిసిందే. గాంధీ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న హీనా(24) ఆదివారం తెల్లవారు జామున మృతి చెందింది. దీంతో మృతుల సంఖ్య రెండుకు చేరింది. అంత్యక్రియలు ముషీరాబాద్ ఖబరస్థాన్‌లో నిర్వహించారు.

కురుమలకు ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


అభివాదం చేస్తున్న వెన్నెల, నర్రి సత్యన్న, చిర్ర చందు, మహేందర్ తదితరులు

పంజాగుట్ట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కురుమలకు ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని కురుమ యువ చైతన్య సమితి వ్యవస్థాపకురాలు జన్ని వెన్నెల డిమాండ్ చేశారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ అధ్యక్షతన ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమితి రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. వివిధ అంశాలపై చర్చించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 50 సంవత్సరాలు నిండిన గొర్రెల కాపరులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని, గొర్రెల కాపరులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, గొర్రెలను మేపుకోవటానికి ప్రతీ గ్రామంలో పదెకరాల ప్రభుత్వ భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒగ్గుడోలు కళాకారులకు ఐడీ కార్డులు, పెన్షన్ ఇవ్వాలని కోరారు. కురుమలకు రాజకీయ వాటా కోసం పోరాడతామన్నారు. విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. గొర్రెల కాపరులకు లైసెన్స్ గన్‌లు ఇవ్వాలని కోరారు. సమితి పేరు చెప్పుకుని వసూళ్లకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ప్రస్తుతం ఉన్న మండల, జిల్లా కమిటీలను రద్దు చేస్తున్నామని, త్వరలో కొత్త కమిటీలను నియమిస్తామని తెలిపారు. అనంతరం రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎమ్మె మహేందర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బండారు శ్రీశైలం, ఉపాధ్యక్షుడిగా దయ్యాల రాజు, ప్రధాన కార్యదరిర్శగా కడారి నరేంద్ర, కార్యదర్శులుగా దయ్యాల మహేష్, శ్రీకాంత్, కోశాధికారిగా పేర్ని రవిని ఎన్నుకున్నారు. సమావేశంలో సమితి సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్

వెంగళరావునగర్‌లో సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే నవీన్ యాదవ్

వెంగళరావునగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ డివిజన్ మాజీ అధ్యక్షుడు దేవిరెడ్డి నాగార్జున రెడ్డి అధ్యక్షతన ఆదివారం మధురానగర్ కాలనీలో పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న నవీన్ యాదవ్ మాట్లాడుతూ నన్ను గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయనని, వారికి నిరంతరం అందుబాటులో ఉంటానని, జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధికి కషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏ సమస్య వచ్చినా పార్టీ నాయకులు, కార్యకర్తలు తనను నేరుగా కలవవచ్చన్నారు. వెంగళరావునగర్ కాలనీలో ఇటీవల కూల్చివేసిన వాటర్‌ట్యాంక్ స్థలాన్ని కాలనీ కోసం కేటాయించాలని అధ్యక్షుడు చిలకల వెంకటేశ్వరరావు కోరారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, నాయకులు గంగారెడ్డి, హనుమంతరావు యాదవ్, మనోజ్ యాదవ్, లక్ష్మణ్‌రావు, రాజేంద్రప్రసాద్, వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు 'వర్సెడ్ బ్లూమ్' అవార్డులు


అవార్డులు అందజేస్తున్న ఇంటెలిజెన్స్ అసిస్టెంట్ కమిషనర్ పి. రాజీవ్ రెడ్డి, సినీ నటుడు పృథ్వీరాజ్

బంజారాహిల్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ చిల్డ్రన్స్ డేను పురస్కరించుకొని వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన చిన్నారులకు విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ 'వర్సెడ్ బ్లూమ్ అవార్డులు ప్రకటించింది. బంజారాహిల్స్ ప్రసాద్ ల్యాబ్స్‌లో ఆదివారం ఇంటెలిజెన్స్ అసిస్టెంట్ కమిషనర్ పి. రాజీవ్‌రెడ్డి, నటుడు పృథ్వీరాజ్ 23 మంది చిన్నారులకు అవార్డులు అందజేశారు. వీరిలో మొక్కల పెంపకం విభాగంలో విశ్వగురు ప్రపంచ రికార్డు సాధించిన ముదు విశ్వామిత్ర చౌహాన్‌కు ప్రత్యేక రికార్డు సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా రాజీవ్‌రెడ్డి మాట్లాడుతూ అవార్డులు మరింత బాధ్యత పెంచుతాయన్నారు. సామాజిక అంశాలపై చిన్న వయసు నుంచి అవగాహన కల్పించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. విశ్వగురు ఫౌండర్ సత్యవోలు రాంబాబు మాట్లాడుతూ చిన్నారుల ప్రతిభను వెలుగులోకి తీసుకువచ్చేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నటి శ్రీలు, డాక్టర్ సురేందర్, మిమిక్రీ రమేష్, జీవీఎస్‌కే న్యూట్రాస్యూటికల్స్ చైర్మన్ కిషోర్‌కుమార్, విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ డైరెక్టర్ సత్యవోలు పూజిత తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ బెటాలియన్‌లో సత్యసాయిబాబా జయంతి


సత్యసాయిబాబాకు నివాళులర్పిస్తున్న పోలీస్ బెటాలియన్ సిబ్బంది

యూసుఫ్‌గూడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీస్ మొదటి బెటాలియన్‌లో సత్యసాయిబాబా జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సత్యసాయిబాబా సేవలను బెటాలియన్ కమాండెంట్ పి. మురళీకృష్ణ కొనియాడారు. ఈ సందర్భంగా సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు రాంబాబు, కె వీవీ ప్రసాద్, నర్సింహ, ఆర్ఐలు కృష్ణార్జునరావు, నాగేశ్వరరావు, రాజేష్, సాంబయ్య, రమేష్ బాబు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.


అయ్యప్ప పూజలో పాల్గొన్న ఏఐసీసీ కో-ఆర్డినేటర్ పీవీ రాజశేఖర్

అయ్యప్ప పూజతో భక్తిభావం పెంపు

ఎర్రగడ్డ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప పూజను నిష్ఠగా చేస్తే భక్తిభావం పెంపొందుతుందని ఎమ్మెల్యే నవీన్ యాదవ్ అన్నారు. ఆదివారం ఎర్రగడ్డ డివిజన్ జనప్రియ మెట్రోపోలిస్ అపార్ట్‌మెంట్‌లో శ్రావణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప పడిపూజ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కొయ్యాడ రాజ్‌కుమార్ గౌడ్, దూడల రవి గౌడ్, నరేందర్ రెడ్డి, కృష్ణమూర్తి, సాయి రూపేష్, పద్మ, భాను యాదవ్, విజయ్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

అయ్యప్ప స్వామి ఆశీస్సులు అందరిపైనా ఉండాలి

ఎర్రగడ్డ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని, ఏఐసీసీ కో-ఆర్డినేటర్ డాక్టర్. పి.వి. రవి శేఖర్ రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం కళ్యాణ్ నగర్ వెంచర్ త్రీలో ప్రశాంత్ స్వామి ఆధ్వర్యంలో అరుణ్ గురుస్వామి నిర్వహించిన అయ్యప్ప పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

సోమాజిగూడలో ఘనంగా పడిపూజ

పంజాగుట్ట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గురుస్వామి రాంపురం శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమాజిగూడ అయ్యప్పస్వామి ఆలయంలో పడిపూజను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే దానం నాగేందర్, కాంగ్రెస్ నాయకులు మహేందర్‌బాబు, వనం శ్రీనివాస్ యాదవ్, రాంనాథ్, ఎస్. నరేష్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలి


లేబర్ కార్డులను అందజేస్తున్న సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మధుకర స్వామి

బేగంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): లేబర్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మధుకర స్వామి అన్నారు. ఆదివారం బేగంపేట మాతాజీనగర్‌లో ఆశ్రయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన లేబర్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 58 మందికి లేబర్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కార్డుల వల్ల ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయన్నారు. రోజువారీ కూలీ చేసుకునే వారు ఈ కార్డులు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. కార్మికులు మృతి చెందితే రూ. 10 లక్షల ప్రమాద బీమా, అంగవైకల్యం కలిగితే రూ. 5 లక్షలు, సహజ మరణం అయితే రూ. 2 లక్షలు బీమాతోపాటు పిల్లల పెళ్లికి రూ. 30 వేల ఆర్థిక సహాయం కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త ఎన్. హరిభూషణ్, ఫీల్డ్ ఆఫీసర్ కాంతయ్య పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరిన మహిళలతో కోట నీలిమ

పలువురు మహిళలు కాంగ్రెస్‌లో చేరిక

బేగంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై మహిళలు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఆ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి డా. కోట నీలిమ అన్నారు. ఆదివారం బేగంపేట డివిజన్‌లోని బ్రాహ్మణవాడి, వడ్డెర బస్తీ, మాతాజీనగర్‌కు చెందిన బీఆర్ఎస్, బీజేపీకి చెందిన సుమారు 120 మంది మహిళలు కాంగ్రెస్ నేతలు విశాల్ సుధాం, రాజేందర్ నేతృత్వంలో కాంగ్రెస్‌లో చేరారు. కోట నీలిమ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ఖమర్ హమీద, నసీర్, జగదీష్, శేఖర్, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

యువతను తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీది కీలక పాత్ర


గుర్రపు స్వారీ చేస్తున్న క్యాడెట్స్‌తో మాట్లాడుతున్న మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా

అల్వాల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేశరక్షణ కోసం యువతను తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ కీలక పాత్ర పోషిస్తోందని మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా అన్నారు. ఎన్‌సీసీ ఆంధ్ర , తెలంగాణ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఆదివారం మెహిదీపట్నం గారిసన్ గ్రౌండ్స్‌లో ఎన్‌సీసీ 78వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాలు చేత పట్టుకుని గుర్రపు స్వారీ చేస్తూ అతిథులకు స్వాగతం పలికారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ క్యాడెట్స్ ఐక్యత, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తితో పాటు ధైర్యం, దృఢత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ కమోడోర్ నర్సింగ్ సైలానీ మాట్లాడుతూ ప్రతీ వ్యక్తికి జీవితంలో క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా క్యాడెట్స్ ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

హైదరాబాద్ రాయల్స్ జట్టులో దివ్యాంశు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఇండియన్ పికిల్‌బాల్ లీగ్ (ఐపీబీఎల్)లో బరిలోకి దిగితున్న హైదరాబాద్ రాయల్స్ జట్టు ఆటగాళ్ల వేలంలో భారత స్టార్ ప్లేయర్లు దివ్యాంశు కటారియా, స్నేహల్ పాటిల్‌ను దక్కించుకుంది. ఆదివారం జరిగిన వేలంలో ఇద్దరు విదేశీ ప్లేయర్లతో సహా మొత్తం ఆరుగురు ఆటగాళ్లను కొనుగోలు చేసినట్టు హైదరాబాద్ జట్టు యజమాని జి.ఆర్.కె.సి రెడ్డి తెలిపారు. దివ్యాంశు, స్నేహల్, తేజస్, బెన్ న్యూవెల్ (అమెరికా), మేగన్ ఫడ్జ్ (అమెరికా) శ్రేయ చక్రవర్తికి హైదరాబాద్ జట్టులో చోటు లభించింది.

గ్రామపాలన ఆఫీసర్స్ అసోసియేషన్
రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా ఉపేంద్రరావు ఎన్నిక



మాట్లాడుతున్న రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి

హైదరాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామ పాలన ఆఫీసర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ నూతన అధ్యక్షుడిగా గరికె ఉపేంద్రరావు, మహిళా అధ్యక్షురాలిగా కంది శిరీషరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా అర్జున్ మల్లారం, ఆర్. విజయ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం లకిడీకాపూల్‌లో తెలంగాణ ఉద్యోగుల, రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి సమక్షంలో రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సంఘం గౌరవాధ్యక్షులుగా వి.లచ్చిరెడ్డి, సలహాదారుగా కె. రామకృష్ణను కమిటీ ఏకగ్రీవంగా ఎనుకుంది. గ్రామ పాలన ఆఫీసర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ కోశాధికారిగా ఇంజమూరి ఈశ్వర్, సెక్రటరీ జనరల్‌గా వి.లక్ష్మీనర్సింహులు, దాసరి వీరన్న, అసోసియేట్ అధ్యక్షులుగా ఏవీ జ్యోతిరెడ్డి, కారుమూరి చంద్రయ్య, ముధుం చిరంజీవి, ఉపాధ్యక్షులుగా బచ్చలకూర పరమేష్, ప్రతిభ, ఎం.చంద్రశేఖర్ గౌడ్, లచ్చిమళ్ల నర్సింహారావు, లక్ష్మీనారాయణ, రాచకొండ నాగలక్ష్మి ఎన్నికయ్యారు.

గచ్చిబౌలిలో రన్‌థాన్-2025

రాయదుర్గం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎక్స్‌ఎల్ఆర్ఎల్ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలో అతిపెద్ద కార్పొరేట్ రన్నింగ్ ఈవెంట్ రన్‌థాన్-2025 నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా అంతర్జాతీయ మారథాన్‌లలో అనుభవజ్ఞులైన డాక్టర్ హరిహరన్, రణవీర్‌సిన్హా పాల్గొని జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. రన్‌లో 1500 మందికిపైగా ఔత్సాహికులు పాల్గొన్నారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.


రన్‌లో పాల్గొన్న ఔత్సాహికులు

అవినీతికి పాల్పడుతున్నదెవరో చెప్పాలి

సికింద్రాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డులో అవినీతికి పాల్పడుతున్నదెవరో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నేరుగా స్పష్టం చేయాలని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి, రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మన్నె క్రిశాంక్ డిమాండ్ చేశారు. ఆదివారం పికెట్‌లోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. శనివారం జరిగిన కంటోన్మెంట్ బోర్డు పాలక మండలి సమావేశంలో పాల్గొన్న అనంతరం ఈటల మీడియా ముఖంగా బోర్డు అవినీతి గురించి వ్యాఖ్యలు చేశారని, బోర్డు ప్రతిష్ఠ మసకబారుతున్నదని, అవినీతిలో కూరుకుపోతున్నదని పేర్కొన్నారని ఆయన అన్నారు. బోర్డు నామినేటెడ్ సభ్యురాలు అవినీతికి పాల్పడుతున్నారా, లేక అధికారులు అవినీతికి పాల్పడుతున్నారా అనే విషయమై ఈటల స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బోర్డు నామినేటెడ్ సభ్యురాలిగా బీజేపీకే చెందిన బాణుక నర్మద ఉన్నారని, మరి ఈటల ఎవరిని ఉద్దేశించి ఈ ఆరోపణలు చేశారని ఆయన ప్రశ్నించారు. కాగా కంటోన్మెంట్‌లో నిర్మాణదారులకు మార్టిగేజ్ నిబంధన అమలు చేయడానికి అటు బీజేపీ నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద, ఇటు స్థానిక కాంగ్రెస్ శాసనసభ్యుడు శ్రీగణేశ్ కారకులని మన్నె క్రిశాంక్ చెప్పారు. తాను, తమ పార్టీ బీఆర్ఎస్ ఈ నిబంధనను తీవ్రంగా వ్యతిరేకించామని, దీనిపై న్యాయస్థానాన్ని సైతం ఆశ్రయించామని గుర్తు చేశారు. మార్టిగేజ్ నిబంధనపై కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ కంటోన్మెంట్ బోర్డు దాఖలు చేయలేదని అన్నారు. ఆరు నెలల క్రితం చేసిన తప్పుకు ఇప్పుడు బీజేపీ, కాంగ్రెస్ నేతలు పశ్చాత్తాప పడుతున్నారని అన్నారు. మార్టిగేజ్ నిబంధనను తొలగిస్తూ తక్షణమే నిర్ణయం తీసుకోవాలని, కంటోన్మెంట్ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని శ్రీగణేష్, బాణుక నర్మదలను మన్నె క్రిశాంక్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు ఆనంద్, కల్యాణ్‌సందీప్, చంద్రశేఖర్, సాయిప్రశాంత్, నిఖిల్, రాకేష్, గ్యానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న మన్నె క్రిశాంక్


ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న తుకారాంగేట్ సీఐ శ్రీకాంత్ రెడ్డి

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన : సీఐ శ్రీకాంత్‌రెడ్డి

అడ్డగుట్ట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి ఆదివారం మారేడుపల్లి వాసులకు సూచించారు. ఈ సందర్భంగా వారికి ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆన్‌లైన్ గేమ్‌లకు యువతీయువకులు దూరంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఆధార్ కార్డు అప్‌డేట్ చేయాలని అందుకు ఓటీపీ చెప్పాలని కొందరు మోసం చేస్తారని ఎవరు కూడా బ్యాంకు నుంచి ఫోన్ చేయరని సూచించారు. అదేవిధంగా మీ ఫోన్‌లకు అపరిచుతులు పంపించే లింకులు, ముఖ్యంగా ఏపీకే ఫైల్స్ ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయవద్దని సూచించారు. బెట్టింగ్ యాప్‌లకు ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని, ఆన్‌లైన్ వెబ్‌సైట్, జాబ్ ఆన్‌లైన్ లింకులు ఎట్టి పరిస్థితిలో ఓపెన్ చేయవద్దని అవగాహన కల్పించారు. అవగాహన కార్యక్రమంలో తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ అడ్మిన్ ఎస్సై కిరణ్ కుమార్, రామకృష్ణలతో పాటు బస్తీవాసులు పాల్గొన్నారు.


రన్‌లో పాల్గొన్న ఔత్సాహికులు

గచ్చిబౌలిలో రన్‌థాన్-2025

రాయదుర్గం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎక్స్‌ఎల్‌ఆర్‌ఎల్ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలో అతిపెద్ద కార్పొరేట్ రన్నింగ్ ఈవెంట్ రన్‌థాన్-2025 నిర్వహించారు. కార్యక్రమానికి అంతర్జాతీయ మారథాన్‌లలో అనుభవజ్ఞులైన డాక్టర్ హరిహరన్, రణవీర్‌సిన్హా ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ రన్‌లో 1500 మందికిపైగా ఔత్సాహికులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం పలువురు విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.


అరుంధతి సేవా సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి

అరుంధతి సేవా సంఘం అధ్యక్షుడి నియామకం

అడ్డగుట్ట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అరుంధతి సేవా సంఘం అధ్యక్షుడిగా వంగపల్లి పరుశరాం, ప్రధాన కార్యదర్శి ఇరుగు బాబును ఆదివారం తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న బాబు జగ్జీవన్‌రాం కమ్యూనిటీ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం సభ్యులు వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం ముఖ్య సభ్యులు మల్లేష్, నర్సింగ్‌రావు, జి.మల్లేష్, మొగులయ్యలతో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు. అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శిలను గౌరవంగా సత్కరించి సన్మానం చేశారు.

ఎంఎంటీఎస్ రైలు ఎక్కేవారే లేరా?

- అమ్ముడు పోనీ టికెట్లు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో లాలాగూడ రైల్వే స్టేషన్ ఉంది. ఈ రైల్వే స్టేషన్ నుంచి మేడ్చల్ మల్కాజిగిరి, దయానంద్‌నగర్ వైపునకు వెళ్లే ఎంఎంటీఎస్ రైలుకు ప్రయాణికులు ఎవరూ ఎక్కడంలేదు. దాంతో రైలు టికెట్లు అమ్ముడు పోకపోవడంతో టికెట్లన్నీ వృథాగా పడి ఉన్నాయి. లాలాగూడ రైల్వే స్టేషన్ నుంచి ఎంఎంటీఎస్ రైలు సర్వీసులు నడుస్తున్నాయని ప్రజలకు సరైన సమాచారం లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. అసలు విషయం ఏమిటంటే బుకింగ్ కౌంటర్ దూరంగా ఉండడంతో కొందరు ప్రయాణికులు టికెట్లు లేకుండానే మొదటి ప్లాట్ ఫాం నంబరు నుంచి ఎంఎంటీఎస్ రైలులో ప్రయాణం చేస్తున్నట్లు తెలిసింది.



లాలాగూడ రైల్వే స్టేషన్ బోర్డు

ఫిస్ట్‌బాల్ చాంపియన్స్ హైదరాబాద్, మెదక్

బోయినపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఫిస్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 9వ రాష్ట్రస్థాయి ఫిస్ట్‌బాల్ ఛాంపియన్స్‌గా బాలికల విభాగంలో మెదక్ బాలుర విభాగంలో హైదరాబాద్ జిల్లా నిలిచింది. ఆదివారం ఎస్‌వీవీఎస్ స్కూల్, బోయినపల్లిలో తెలంగాణ ఫెస్టివల్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు జరిగాయి. ఈ క్రీడల్లో రాష్ట్రానికి చెందిన 9 జిల్లాల బాల బాలికల జట్లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఫిస్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫీస్ట్‌బాల్ క్రీడా అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని, ఐదు సంవత్సరాలుగా ఈ క్రీడకు ఆదరణ పెరిగిందని తెలిపారు. ఈ పోటీల్లో బాలికల విభాగంలో మెదక్ జిల్లా చాంపియన్‌గా నిలవగా, రెండోస్థానంలో హైదరాబాద్, మూడోస్థానంలో రంగారెడ్డి జిల్లా నిలిచింది. బాలుర విభాగంలో హైదరాబాద్ చాంపియన్స్‌గా నిలవగా, రెండోస్థానంలో నిజామాబాద్, మూడో స్థానంలో భువనగిరి జిల్లా గెలిచింది. ఈ నేపథ్యంలో ప్రతాప్ విజేతలకు ట్రోఫీలను అందజేసి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వెంకట్, పవన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న ఫిస్ట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ జంపన ప్రతాప్



వైన్స్‌షాపు పెట్టవద్దని బస్తీవాసులతో కలిసి ఆందోళన చేస్తున్న కార్పొరేటర్ సామల హేమ తదితరులు

వైన్స్‌షాపు పెట్టవద్దని బస్తీవాసుల ఆందోళన

బౌద్ధనగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో పార్శీగుట్ట బాపూజీనగర్ చౌరస్తాలో నూతనంగా పెడుతున్న వైన్స్‌షాపును పెట్టవద్దని ఆదివారం బాపూజీనగర్ ప్రధానరోడ్డుపై బస్తీవాసులు ఆందోళన చేపట్టారు. సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ పాల్గొని బస్తీవాసులకు మద్దతుగా నిలబడ్డారు. ఈ సందర్భంగా కార్పొరేటర్, బస్తీవాసులు మాట్లాడుతూ ఇప్పటికే ఈ చౌరస్తాలో ఒక వైన్స్, కల్లు కాంపౌండ్‌లున్నాయని, మరో వైన్స్ పెడితే బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. నూతనంగా పెట్టే వైన్స్‌షాపు పక్కనే మహాత్మాగాంధీ, జయశంకర్ విగ్రహాలున్నాయని, ఆ విగ్రహాల పక్కన వైన్స్‌షాపు ఎలా పెడతారని ధ్వజమెత్తారు. నూతనంగా వైన్స్‌షాపును పెడితే పరిమాణాలు తీవ్రంగా ఉంటాయని వారు హెచ్చరించారు. ఈ ఆందోళనలో అల్లర్లు జరగకుండా వారాసిగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు విష్ణుచారి, ఎల్లయ్య, సంతోష్, బీఆర్ఎస్ నాయకులు రూపేష్, ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బలిదాన దినోత్సవం


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న సిక్కు గురువులు


గురు తేజ్‌బహదూర్ సాహెబ్‌జీ 350వ బలిదాన దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సిక్కులు

బౌద్ధనగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదవ సిక్కు గురు తేజ్‌బహదూర్ సాహెబ్‌జీ 350వ బలిదాన దినోత్సవ వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సీతాఫల్‌మండిలోని గురుద్వారా గురుసింగ్ సభ ప్రబంధక్ కమిటీ ఆధ్వర్యంలో చిలకలగూడ మున్సిపల్ గ్రౌండ్ మైదానంలో నిర్వహించిన విశాల్ కీర్తన్, మాస్ కీర్తన దర్బార్(భక్తిసభ)లో వివిధ ప్రాంతాల నుంచి సిక్కులు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గుర్బాణి కీర్తనలు ఆలపించారు. ప్రబంధక్ కమిటీ చైర్మన్లు హర్పాల్ సింగ్, కంచన్‌సింగ్, అధ్యక్షుడు ప్రతాప్‌సింగ్, ఉపాధ్యక్షుడు రాజేందర్‌సింగ్, ప్రధాన కార్యదర్శి ఎస్.రంజిత్‌సింగ్, జాయింట్ సెక్రటరీ జగ్జీత్‌సింగ్ ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మాట్లాడారు.

సిక్కుగురువుల సర్వజనహిత బోధనలు, సత్యం, దయ, సమానత్వం, సామరస్యం, శాంతిభావం గురునానక్, సిక్కు గురువుల సందేశాలను తెలిపారు.


సత్యసాయి శతజయంతి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

సీతాఫల్‌మండిలో సత్యసాయి శతజయంతి

బౌద్ధనగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండిలో సాయి విద్యాలయ హైస్కూలులో ఆదివారం సత్యసాయిబాబా జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్కూల్ కరస్పాండెంట్ వేంకటేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో స్థానికులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్యసాయిబాబా చిత్రపటం వద్ద పూలు వేసి పూజలు చేశారు. అనంతరం భజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.


నియామక పత్రం అందజేస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్‌గా స్వామిగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్‌గా పీహెచ్‌డీ రీసెర్చ్ స్కాలర్ బొల్లెపల్లి స్వామిగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీసీ జేఏసీ విస్తృత స్థాయి సమావేశంలో బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక రాష్ట్ర స్థాయి ఉద్యమాల్లో స్వామిగౌడ్ చాలా చురుగ్గా పని చేశారన్నారు. బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం తన శక్తివంచన లేకుండా పోరాటం చేశాడని స్వామిగౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో తాళ్లూరి కౌశిక్, శ్రవణ్, అరవింద్, లక్ష్మణ్, సుభాష్, విగ్నేష్, గణేష్, సైదులు, శివ యాదవ్, లింగస్వామి, శ్రీకాంత్, రమేష్, లింగాల మహేష్, వెంకట్, రఘు, వంశీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఎస్సీ బాలికల వనభోజనం

ముషీరాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం భోలక్‌పూర్‌లోని ఎస్సీ బాలికల వసతి గృహం విద్యార్థినులకు వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. భోలక్‌పూర్ గాంధీనగర్‌లో గల కోదండరెడ్డి పార్కులో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ సోషియల్ వెల్ఫేర్ ఆఫీసర్ శాంతి ముఖ్య అతిథిగా హాజరై వనభోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో ఐక్యత, మన సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసే విధంగా వనభోజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సుకన్య తదితరులు పాల్గొన్నారు.



గాంధీనగర్ కోదండరెడ్డి పార్కులో వనభోజన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అసిస్టెంట్ సోషియల్ వెల్ఫేర్ ఆఫీసర్ శాంతి

వెయిట్ లిఫ్టింగ్‌లో యువకుడి ప్రతిభ

బౌద్ధనగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పదకొండవ తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ కాకతీయ యూనివర్శిటీలో ఇటీవల నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సీతాఫల్‌మండి బీదలబస్తీకి చెందిన యువకుడు ప్రతిభను కనబర్చాడు. వెయిట్ లిఫ్టర్ జీఎం రేవంత్ యూత్ 65కేజీల విభాగంలో పాల్గొని యూత్, సీనియర్, జూనియర్ విభాగాల్లో మొదటిస్థానంలో గెలుపొందాడు. జీఎం.రేవంత్‌ను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.


వెయిట్ లిఫ్టింగ్ చేస్తున్న జీఎం రేవంత్


కాంగ్రెస్‌లో చేరిన మహిళలతో కోట నీలిమ

పలువురు మహిళలు కాంగ్రెస్‌లో చేరిక

బేగంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై మహిళలు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఆ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి డా. కోట నీలిమ అన్నారు. ఆదివారం బేగంపేట డివిజన్‌లోని బ్రాహ్మణవాడి, వడ్డెర బస్తీ, మాతాజీనగర్‌కు చెందిన బీఆర్ఎస్, బిజేపీకి చెందిన సుమారు 120 మంది మహిళలు కాంగ్రెస్ నేతలు విశాల్ సుధాం, రాజేందర్ నేతృత్వంలో కాంగ్రెస్‌లో చేరారు. కోట నీలిమ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ఖమర్ హమీద, నసీర్, జగదీష్, శేఖర్, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి కృషి

వెంగళరావునగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సంఘం జవహర్‌నగర్ అధ్యక్షుడు నెల్లి శంకర్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం జవహర్‌నగర్‌లో ముదిరాజ్ సంఘం విస్తృతస్థాయి సమావేశం జరిగింది. వివిధ అంశాలపై చర్చించారు. ముదిరాజ్‌లకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతోందన్నారు. ముదిరాజ్‌లను బీసీ-డి గ్రూపు నుంచి బీసీ-ఏ గ్రూపులోకి మార్చాలని కోరారు. అనంతరం సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నెల్లి శంకర్ ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా గంట నారాయణ స్వామి, మాదాసు రాజు, ప్రధాన కార్యదర్శిగా పసుల రామకృష్ణ ముదిరాజ్, కోశాధికారిగా వనపర్తి రవీంద్ర ముదిరాజ్, సంయుక్త కార్యదర్శులుగా పి.చిన్నయ్య, చంద్రమౌళి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా నెల్లి కనకయ్య, నరసింహ, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా వెంకటేష్, ఎస్. శ్రీను, ఎస్.రవి, డి.వినోద్, ఎస్.శ్రావణ్, డి కృష్ణ, పరమేష్, సందీప్, నెల్లి ప్రదీప్ ముదిరాజ్, సలహాదారులుగా ఎం.రాములు, ఏ.రాజేంద్ర, దండు సత్యనారాయణ ఎన్నికయ్యారు.

హైడ్రా కమిషనర్ అబద్ధం చెబుతున్నారు

- హనుమాన్ ఆలయ స్థాన చలనానికి అంగీకరించలేదు
- సియెట్ నివాసితుల అసోసియేషన్ అధ్యక్షుడు డా.సదానందం

హైటెక్‌సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గుట్టల బేగంపేట్‌లోని సున్నం చెరువు వద్ద ఉన్న హనుమాన్ ఆలయం స్థాన చలనానికి తాము అంగీకరించినట్టు హైడ్రా కమిషనర్ చెప్పిన దాంట్లో వాస్తవం లేదని, ఆయన అబద్ధాలు చెబుతున్నారని సియెట్ నివాసితుల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సదానందం అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. హనుమాన్ ఆలయం స్థాన చలనంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ తమతో సంప్రదించలేదన్నారు. సమస్యలపై ఆయనను కలిశామని ఆ ప్రకటనలో తెలిపారు.

నకిలీ సర్టిఫికెట్లు తయారీ ముఠా అరెస్ట్

నార్సింగ్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ విద్యా సర్టిఫికెట్లు తయారు చేసి విక్రయిస్తున్న ఓ గ్యాంగ్‌ను నార్సింగ్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు, విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. మీర్జా అక్తర్ ఆలీ బేగ్ అలియాస్ అస్లాం, మహ్మద్ ఆజాజ్ అహ్మద్, వడ్డేపల్లి వెంకట్‌సాయి, విస్టాలా రోహిత్ కుమార్, సత్తూరి ప్రవీణ్ నకిలీ సర్టిఫికెట్లను తయారీ చేయడం పనిగా పెట్టుకున్నారు. నార్సింగ్ చింతచెట్టు ప్రాంతంలో పోలీసులు పహారా ఏర్పాటు చేసి, నకిలీ సర్టిఫికెట్లను కస్టమర్లకు ఇవ్వడానికి వచ్చిన ఐదుగురు వ్యక్తులను పట్టుకున్నారు. ఆ సమయంలో వారి నుంచి ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, బెంగళూరు సిటీ యూనివర్సిటీ పేర్లతో ఉన్న నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లు, మెమోలు, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు, బోనాఫైడ్ సర్టిఫికెట్లు, ఇతర నకిలీ రికార్డులు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ గ్యాంగ్ డబ్బుల కోసం నకిలీ, విద్యా సర్టిఫికెట్లు తయారు చేసి ప్రజలను మోసం చేయడం పనిగా పెట్టుకుంది. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


సత్యసాయి బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్, అధికారులు

'సత్యసాయి' సేవలు వెలకట్టలేనివి

- అదనపు కలెక్టర్ కదిరవన్

హైదరాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్యం, ధర్మం, శాంతి కోసం పరితపించిన పుట్టపర్తి సత్యసాయి బాబా ప్రజలకు అందించిన సేవలు వెలకట్టలేనివి అని జిల్లా అదనపు కలెక్టర్ కదిరవన్ పలని అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆదివారం సత్యసాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సత్యసాయి బాబా గొప్ప మానవతామూర్తి అని, ఆయన ఆధ్యాత్మిక నాయకత్వం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. పేదల కోసం ఉచిత ఆస్పత్రులు, పాఠశాలలు, గ్రామీణ ప్రాంతాల్లో నీటి ప్రాజెక్టులను నిర్మించారని గుర్తుచేశారు. సత్యసాయి ఆశయసాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, జిల్లా క్రీడాశాఖ అధికారి సుధాకర్, కలెక్టరేట్ ఇన్‌చార్జి ఏఓ విజయలక్ష్మి, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌సీసీ 78వ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో కెడెట్స్‌తో కలిసి పాల్గొన్న మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా, కమోడోర్ నర్సింగ్ సైలానీ


వార్షికోత్సవంలో గుర్రపు స్వారీ చేస్తున్న కెడెట్‌తో మాట్లాడుతున్న మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా

అల్వాల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఆదివారం మెహదీపట్నం గారిసన్ గ్రౌండ్స్‌లో ఎన్‌సీసీ 78వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన అతిథులకు కెడెట్‌లు జాతీయ జెండాలు చేత పట్టుకుని గుర్రపు స్వారీ చేస్తూ స్వాగతం పలికారు. ముఖ్యఅతిథిగా హాజరైన మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా కెడెట్స్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. ఎన్‌సీసీ నినాదం- కెడెట్స్‌ల జీవితంలో క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తితో పాటు ధైర్యం, దృఢత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో యువ కెడెట్స్ సాధించిన విజయాలతో పాటు పురస్కారాలను కూడా ఆయన హైలెట్ చేశారు. యువతను తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ కీలక పాత్రను పోషిస్తుందన్నారు. కెడెట్స్‌ల సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఎంతోగాను ఆకట్టుకున్నాయి. ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ కమోడోర్ నర్సింగ్ సైలానీ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితంలో క్రమశిక్షణ ఎంతో అవసరమని, దేశంలోని యువతను తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ ఎంతోకృషి చేస్తుందన్నారు. ఆల్ ఇండియా స్థాయిలో నిర్వహించిన శిబిరాల్లో కెడెట్స్ కీలక విజయాలను సాధించారని ఆయన కొనియాడారు.


అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న బీసీ విద్యార్థి జేఏసీ

జీవో 46ను వెనక్కి తీసుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీవో 46ను వెనక్కి తీసుకునే వరకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకూడదని బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ కొమ్మనబోయిన సైదులు యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీలోని లా కళాశాలలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు సీఎం అన్ని పార్టీల నేతలను ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధాన మంత్రి, రాష్ట్రపతికి వినతిపత్రాలు ఇవ్వాలని సూచించారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో ప్రయివేటు బిల్లు తీర్మానం తీసుకురావాలని కోరారు. బీసీ రిజర్వేషన్ల కోసం తెలంగాణ ఉద్యమం తరహాలో పోరాటం అవసరమని, ఈ విషయంపై పార్లమెంట్‌లో మాట్లాడని ఎంపీలు రాజీనామాలు చేసి మళ్లీ ప్రజల్లోకి రావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు చేరాల వంశీ, వర్కింగ్ ప్రెసిడెంట్ భారీ అశోక్, అధికార ప్రతినిధి నూక మధు, నాయకులు భూషణ్, మహేష్, శివ, నగేష, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.